క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

• చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గణేష్


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే పెట్ల ఉమా. శంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీలోని ఇద్దరికి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న చల్లా సతీష్‌కు రూ.2.5 లక్షలు, భీమిరెడ్డి శారదకు రూ.18 వేల చొప్పున మొత్తం రూ.2.68 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఎమ్మెల్యే అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మందిని ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చిటీల రాము పాల్గొన్నారు.

చర్చిల్లో క్రిస్మస్ సందడి


ఎల్.బి.పురం చర్చి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్


బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుచ్చెయ్యపేట, వడ్డాది మేజరు పంచాయతీ, ఎల్.బి. పురం, దిబ్బిడి, రాజాం, సీతయ్యపేట, తురకలపూడి, మంగళాపురం, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో చర్చిలకు రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రంగు రంగుల క్రిస్మస్ స్టార్స్ అలంకరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల చర్చిల్లో క్రిస్మస్ ఫెలోషిప్ పేరుతో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి


వేడుకల్లో పాల్గొన్న దివ్యాంగులు

చీడికాడ: దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి చేస్తామని వికలాంగు హక్కుల పోరాట సమితి మాజీ అధ్యక్షుడు మతల అప్పలనాయుడు తెలిపారు. దివ్యాంగుల దినోత్సవాన్ని ఖండివరంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు పాసులకు అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీరిందరి పాసులు జారీ అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హక్కుల పోరాట సమితి నేతలు వి.శ్రీను, లెక్కల గోవింద పాల్గొన్నారు.

పెద్దేరుకు తగ్గిన ఇన్‌ఫ్లో


పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు, శుక్రవారం నాటికి 136.55 మీటర్లకు చేరింది. నాలుగు రోజులు క్రితం వరకు జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరేది. ప్రస్తుతం 300 క్యూసెక్కులు మాత్రమే వచ్చి చేరుతుండడంతో అంతే వరద నీరు జలాశయం అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

21న సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. స్థానిక మండల సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

గిరిజనులకు పట్టాభిషేకం

పేదలకు మేలు చేయడంలో ఎంతటి సాహసానికైనా తండ్రీతనయులు వెనుకాడేవారు కాదంటే అతిశయోక్తికాదు. అందుకే ఆనాడు కఠినమైన అటవీ హక్కు చట్టాలను మార్చి పోడు భూములకు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సాగు హక్కులు కల్పించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మళ్లీ గిరిజనుల గోడు పట్టించుకోలేదు. ఇప్పుడు మరలా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. సాగుకు పెట్టుబడి సాయం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారు.



- 806 మందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు
- 1500 ఎకరాలకుపైగా సాగు హక్కులు
- ఏటా రైతు భరోసా వర్తింపు


గిరిజనులకు పాసుపుస్తకాలు ఇస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ (పాతచిత్రం)


సరుగుడులో గిరిజనులు సాగు చేసే పోడు భూమి

నాతవరం మండలం	
మొత్తం గిరిజన గ్రామాలు	- 32
మైదాన ప్రాంతంలో గిరిజన గ్రామాలు	- 08
1/70 యాక్టు పరిధిలో గిరిజన గ్రామాలు	- 24
మూడు విడతలుగా భూములకు పాసు పుస్తకాలు ఇచ్చిన వివరాలు	
మొదట విడతలో 83 మందికి 199 ఎకరాల 35 సెంట్లు	
రెండో విడతలో 163 మందికి 444 ఎకరాల 56 సెంట్లు	
మూడో విడతలో 560 మందికి 1,212 ఎకరాల 25 సెంట్లు	
మూడేళ్లుగా రైతు భరోసా సాయం కింద అందుకుంటున్న గిరిజనులు	- 678 మంది
మిగిలిన వారికి రెండేళ్లుగా వస్తోంది.	

నాతవరం: మండలంలో 1500 ఎకరాలకుపైగా పోడు సాగు భూములకు రికగ్నిజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్వోఎఫ్ఆర్) కోసం గిరిజనులు దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నారు. ఏ ఒక్క ప్రభుత్వమూ పట్టించుకున్న పాపానపోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రత్యేక కృషితో వీటికి సంబంధించి మూడు విడతలుగా 806 మందికి పట్టాదారు పాసు పుస్తకాలు అందించారు. వారిలో ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబరు బ్యాంకు ఖాతా కరెక్టుగా ఉన్నవారికి రైతు భరోసా సాయం కింద ఏడాదికి రూ.13,500 అందిస్తున్నారు.

గిరిజన రైతులు ఆనందం

సరుగుడు, సుందరకోట పంచాయతీల శివారు 16 గిరిజన గ్రామాల్లో కొన్ని భూములు గ్యాప్ ఏరియా పరిధిలో ఉన్నాయి. వీటిని బ్రిటీష్ హయాంలో సర్వే చేయకుండా వదిలేశారు. మిగతావి సర్వే చేయడంతో వాటిని ఈ ప్రాంత గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న వీరికి గత ప్రభుత్వాలు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి అర్హతను బట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వడమే కాకుండా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నారు. దీంతో 1/70 యాక్టు పరిధిలోని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజన మహిళలు


గిరిజనులకు ఇచ్చిన అటవీ హక్కు పత్రాలు

చాలా ఆనందంగా ఉంది



నేను చిన్నప్పుడు నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. మా భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ఏళ్లుగా అధికారులను ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకున్న పాపానపోలేదు. జీవితం అయిపోతోంది.. నేను బతికి ఉండగా సాగు హక్కులు పత్రాలు పొందలేం అనుకున్నాను. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పైసా ఖర్చు లేకుండా నేరుగా పట్టా పాసుపుస్తకాలు ఇచ్చి జీవితంలో వెలుగులు నింపారు. చాలా సంతోషంగా ఉంది

– మద్దేల నూకరాజు, సరుగుడు గ్రామం, నాతవరం

కుటుంబానికి భరోసా



మా పూర్వీకుల కాలం నుంచి పోడు సాగు చేస్తున్నాం. అదే భూమిపై మేము ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. రెవెన్యూ అధికారులు వచ్చి కాగితాలు పెట్టకొండి, మీ భూములకు పుస్తకాలు ఇస్తామన్నారు. కాగితాలు పెట్టిన కొద్ది రోజులకే నాతవరం తహసీల్దారు కార్యాలయం నుంచి కబురొచ్చింది. అక్కడ ఎమ్మెల్యే గణేష్ పట్టా పాసుపుస్తకాలు ఇచ్చారు. అధికారులకు నాయకులకు ఒక్క పైసా ఇవ్వలేదు. మా లాంటి వారందరికి పెట్టుబడులకు డబ్బులు ఇస్తున్నారు. మా కుటుంబానికి భరోసా కల్పించారు.

– దుంపా లక్ష్మి, రామన్నపాలెం గ్రామం, సరుగుడు పంచాయతీ, నాతవరం మండలం

21న మెగా రక్తదాన శిబిరం


పోస్టరు విడుదల చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి తెలిపారు. ఈ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్సతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని అత్యవసర సమయంలో రోగులకు అందిస్తామన్నారు. యువకులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టరు పైల పోతురాజు, ఎంపీటీసీ సభ్యులు ఇనపసప్పల పుష్ప, పోలుర్తి వెంకటరమణ, తమరాన సత్యనారాయణ గాడి రమేష్‌దేవి, సీనియర్ నాయకుడు ఇట్టంశెట్టి శ్రీనివాసరావు, ఉలబాల శ్రీను, గుడపర్తి అచ్చియ్యనాయుడు, ఏఎంసీ డైరెక్టరు బండి గంగరాజు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

మాడుగుల రూరల్: ఎం. కోడూరు సహకార సంఘం వద్ద డిజిటల్ అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, స్థానిక పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా సదుపాయాలు గురించి సంఘ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేశ్ వివరించారు. సంఘ పరిధిలో మొండి బకాయిలు రూ.30 లక్షల వసూలు చేసినట్లు, సభ్య రైతులకు రూ.1.67 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. రానున్న రెండేళ్లలో సిబ్బంది కృషితో శతశాతం రుణాలు వసూలు చేసి సంఘ అభివృద్ధికి పాటుపడతామన్నారు. 2007లో తీసుకున్న రుణ బకాయిలు తిరిగి రెన్యువల్ చేసుకుంటే, ప్రభుత్వ రాయితీలకు అర్హత పొందుతారన్నారు. రుణ బకాయిదార్లు రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సీఈవో రామునాయుడు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు ఘన సత్కారం


సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు


మాట్లాడుతున్న ఉప కోశాధికారి గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వ పెన్షనర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు గజ్జలమ్మ మాట్లాడుతూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసుకవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్టీవో గణేష్, ఎస్‌బీఐ మేనేజర్ ఆర్.నాగేశ్వరరావు, బి.వి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

మాకవరపాలెం: పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నర్సీపట్నం ఉప కోశాధికారి గణేష్ అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని తామరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని సూచించారు. మండల పెన్షన్‌దారుల సంఘ కార్యదర్శి రంగరాజు మాట్లాడుతూ పెన్షన్‌దారులంతా సమష్టిగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సంఘ సభ్యులు ముత్యాలరాజు, శేషగిరిరావు, నూకరాజు పాల్గొన్నారు.

పార్థసారథి ఆలయంలో ధనుర్మాస పూజలు


జేడీపేటలో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్, భక్తులు


మాడుగులలో పార్థసారథి స్వామికి అలంకరణ


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

మాడుగుల: పట్టణంలోని అతి పురాతనమైన పార్థసారథి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామ భక్తి బృందం తెల్లవారు గ్రామంలో మేలుకొలుపులు నిర్వహించింది. జమ్మాదేవి పేటలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించారు.

మాడుగుల రూరల్: రామాలయాలు, వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున నెల గంట పెట్టడంతో కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండగ వరకు స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. భోగి రోజు రాత్రికి గోదాదేవి కల్యాణం స్థానిక కళా వేదికపై నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆదివారం తెలిపారు. కె.జె.పురం, వీరవల్లి, వంటర్లపాలెం, ముకుందపురం, ఎం. కోటపాడు, వీరనారాయణం, పెంటయ్యపాలెం, కొండయ్యపాలెం, గాదిరాయి, తదితర రామాలయాల్లో ధనుర్మాసోత్సవాలు సందర్భంగా పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మేలుకొలుపు, స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

రబీ సాగుకు సన్నద్ధం


సత్యవరంలో ఏపుగా ఎదుగుతున్న వరి నారు

మాడుగుల: ఒక వైపు ఖరీఫ్ వరి పంట పనులు చివరి దశకు చేరుకున్నాయి. రైతులు పొలాల్లో పంటను కళ్లాలకు చేర్చుతున్నారు. నూర్పులు ముమ్మరంగా చేస్తున్నారు. మరోవైపు మరికొంతమంది రైతులు రబీ వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు ముందుగానే పంపిణీ చేశారు. తుపాను వర్షాలకు చెరువులన్నీ నిండి పుష్కలంగా నీరు ఉంది. దాంతో ఈ ఏడాది రబీ సాగు కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో నాలుగు వేల ఎకరాల్లో రబీ వరి సాగు చేయడానికి నారుమడులు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఏపుగా ఎదుగుతోంది.

నేడు సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజలు


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామివారు

మాడుగుల రూరల్: సుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉపాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి సోమవారం ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆదివారం తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు 108 తమలపాకులు, తేనె, నెయ్యి, కొబ్బరికాయ, అరటిపండ్లు, హారతి తీసుకుని రావాలని కోరారు.

చదువులమ్మ ఒడిలో ఆత్మీయ కలయిక


కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న 1991-92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కె.కోటపాడు: వారంతా కలిసి ఒకే దగ్గర చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇప్పుడు మళ్లీ అందరూ కలిశారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఇవి చౌడువాడ జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కనిపించిన దృశ్యాలు.. ఇక్కడ 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. 30 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితుల కష్టాసుఖాల్లో పాలుపంచుకోవాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు గంద్రేటి సత్యంమూర్తి, వైఎస్సార్‌సీపీ చోడవరం మండలాధ్యక్షుడు దొడ్డి వెంకటరావు(డీవీఆర్), తనకల జగన్నాథరావు, తనుబుద్ధి నాగేశ్వరరావు, దాడి నాగరాజు, కాశీ పూర్ణదేశాయ్, శరగడం రామసూరి అప్పారావు, రాజి కృష్ణమూర్తి, దొడ్డి నాగేశ్వరరావు, బండారు శ్రీను, బంటు శ్రీను, వంటాకు సన్యాసినాయుడు, పాచిల హనుమంతురావు, లక్ష్మణరావు, తరకల రాంబాబు, చిరికి రమేష్, మారడబూడి రాము, కొరిబిల్లి అప్పారావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాలలో 1991–92 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. 12 ఏళ్ల నుంచి ఏటా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వారంతా తమతో చదువుకుని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి సాయం చేసేందుకు నిర్ణయించుకున్నారు. 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మీయ కలయికలో 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

వాకర్స్ క్లబ్ సంక్షేమానికి కృషి

• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


సమావేశంలో బ్రోచర్ విడుదల చేస్తున్న ధర్మశ్రీ

చోడవరం: వాకర్స్ క్లబ్‌లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం వాకర్స్ క్లబ్ వనసమారాధన, సర్వసభ్య సమావేశం అడ్డూరు గ్రామంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. సభ్యుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. వాకర్స్ క్లబ్ భవనంలో మౌలిక సదుపాయలు కల్పిస్తామని చెప్పారు. క్లబ్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పీఎస్ఎన్ గుప్తా, శరగడం చిమ్మినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగు డేవిడ్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి లక్ష్యం దిశగా సాగాలి


మంచాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

చీడికాడ: దేశాభివృద్ధి లక్ష్యం దిశగా ప్రతి పౌరుడి ఆలోచనలు సాగాలని ఈవోపీఆర్డీ కామేశ్వరరావు తెలిపారు. ఆదివారం మంచాలలో విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్రాలను అభివృద్ధి పథంలో నడిపే వారిని గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతికి సంతాపం


రామునాయడు పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న విప్ ధర్మశ్రీ

రోలుగుంట: అడ్డసరం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు విస్సారపు రామునాయుడు(69) ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆ గ్రామానికి చేరుకుని అతడి పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. రామునాయుడు మృతి పార్టీకి తీరని లోటన్నారు. అతని కుటుంబానికి స్థానిక పార్టీ నాయకులు అండగా ఉండాలన్నారు.